రోడ్డు నిర్మాణ పనులు షురూ..

పార్శిగుట్ట మార్గంలో కొనసాగుతున్న రోడ్డు పనులు

- 26వ తేదీ నాటికి పూర్తి చేసేలా అధికారుల కసరత్తు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

ముషీరాబాద్, జూన్ 14: రాంనగర్-పార్శిగుట్ట రోడ్డు నిర్మాణ పనులు ఎట్టకేలకు మొదలయ్యాయి. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పనులను ఇటీవల జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు చేపడుతున్నారు. గతంలో పైపులైన్ పనుల మూలంగా రోడ్డు నిర్మాణం వాయిదా పడటంతో ఇంజినీరింగ్ విభాగం అధికారులు జలమండలి అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులు మొదలు పెట్టారు.

రూ.80 లక్షల వ్యయంతో శ్రీకారం..

పార్శిగుట్ట రోడ్డు ఇటీవల గుంతలమయంగా మారడంతో అధికారులు రూ.80 లక్షల వ్యయంతో కొత్త రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మళ్లీ రోడ్డు తవ్వకాలకు అస్కారం లేకుండా డ్రైనేజీ పైపు లైన్ నిర్మాణాలు చేపట్టిన తరువాత పనులు మొదలు పెట్టారు. ప్రస్తుతం పార్శిగుట్ట-రాంనగర్ మార్గంలో వాహనాలను దారి మళ్లించి రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఇప్పటికే కాంక్రీట్ పనులు మొదలు పెట్టిన అధికారులు ఈ నెల 26వ తేదీ నాటికి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఎట్టకేలకు పార్శిగుట్ట రోడ్డు నిర్మాణ పనులు చేపడుతుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్

గోల్నాక, జూన్ 14 : పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం గోల్నాకలోని కార్పొరేటర్ క్యాంపు కార్యాలయంలో పారిశుధ్య పర్యవేక్షకులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రభలే అవకాశాలున్నాయని, ప్రధాన రహదారులతో పాటు బస్తీలు, కాలనీల్లో ప్రతి రోజూ చెత్త ఎత్తివేయాలని ఆమె తెలిపారు.

విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించాలి



బడిబాట కార్యక్రమంలో భాగంగా నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి, మురాద్‌నగర్‌లలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు నోట్‌బుక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్యను అందించడానికి కృషి చేయాలని పేర్కొన్నారు. – మెహిదీపట్నం, జూన్ 14

చిన్న వయస్సు నుంచే పొదుపు అలవాటు చేసుకోవాలి

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెడ్ పోస్ట్ మాస్టర్ రమేశ్

కవాడిగూడ, జూన్ 14: చిన్న వయస్సు నుంచే పొదుపు అలవాటు చేసుకోవాలని హెడ్ పోస్ట్‌మాస్టర్ నరేశ్ సూచించారు. అప్సాలాంటి సంస్థలు పిల్లలకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. దోమలగూడలోని ఎంసీహెచ్ కాలనీ పాఠశాలలో విద్యార్థులకు అప్సా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పొదుపుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆడపిల్లల కోసం సుకన్య సంవృద్ధి యోజన పుట్టిన పాప నుంచి 9 ఏండ్ల వయస్సు వారు ఈ పథకంలో చేరవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో అప్సా సీనియర్ కో-ఆర్డినేటర్ బొట్టు రమేశ్, ప్రతినిధులు శ్రావణి లావణ్య, ఫ్యామిలీ ప్లానింగ్ సమస్త ప్రతినిధులు వనిత శ్రీనివాస్, రోద మిస్టీ కళాశాల విద్యార్థులు, దర్షన్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కృష్ణమాచార్యుల శతజయంతి సభ

తెలుగు యూనివర్సిటీ, జూన్ 14 : కళామంజరి, నవ్యసాహితీ సమితి ఆధ్వర్యంలో సంగీత, సాహిత్య, అవధాని నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యుల శత జయంతి సభ జూన్ 17 శనివారం నిర్వహిస్తున్నట్లు సమన్వయకర్త వేమరాజు విజయకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సాహి తీ, సంగీత సమర్చన శీర్షికతో నిర్వహిస్తు న్న సదస్సులో పలువురు సాహితీవేత్తలు పాల్గొని ప్రసంగించనున్నట్లు తెలిపారు.

బీఈడీ పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 14: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను విడుదల చేశామని చెప్పారు. ఈ ఫలితాల కోసం ఓయూ వెబ్‌సైట్ www. osmania. ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

వివిధ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 14: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ (పీసీఐ) ఎనిమిదో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును ఈ నెల 18లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. మాస్టర్స్ డిగ్రీ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎండీహెచ్ఎం) రెండు, నాలు గో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును ఈ నెల 21లో గా సంబంధిత కళాశాలల్లో చెల్లించవచ్చని పేర్కొన్నారు. రూ.300 అపరాధ రుసుముతో 25 వరకు చెల్లించవచ్చన్నా రు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు, పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

బావను చూడడానికి వచ్చిన బావమర్ది అదృశ్యం

రాజు (ఫైల్)

కాచిగూడ,జూన్ 14: బావను చూడడానికి వచ్చిన బావమర్ది అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్సై డి. సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. మొగల్‌పుర ప్రాంతానికి చెందిన వడేప్ప కుమారుడు బి.రా జు(22) కూలీ. అనారోగ్యంతో ఆతని బావ శివ పుత్రుడు కాచిగూడలోని సాయికృష్ణ న్యూరో దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. బావను చూడడానికి మే నెల 28వ తేదీన రాజు దవాఖానకు వచ్చాడు. అప్పటి నుంచి ఇంటికి రాకపోవడంతో కలత చెందిన తల్లి అంజమ్మ కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇంట్లోంచి రాజు వెళ్లే సమయంలో ఎరుపు రంగు చొక్క, కాకి రంగు ప్యాంట్ ధరించి, ఎత్తు 5.5 ఉన్నట్లు పోలీసులు తెలిపారు. తల్లి ఫిర్యా దు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలుడు అదృశ్యం

పవన్‌కుమార్

గోల్నాక, జూన్ 14 : ఆడుకోవడానికి వెళ్లిన బాలుడు అదృశ్యమైన ఘటన అంబర్‌పే ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై విజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. బాగ్‌అంబర్‌పేటకు చెందిన చందు కుమారుడు పవన్‌కుమార్ (11) స్థానిక స్కూల్లో 5వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 12న సా యంత్రం ఆడుకుంటానని బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో బాధితుడి తండ్రి చందు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇన్విటేషనల్ టోర్నీ..

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గౌలిపురలో శుక్రవారం మొదలైన రాష్ట్ర స్థాయి ఇన్విటేషనల్ టోర్నీలో నవశక్తి క్రీడా మండల్ శుభారంభం చేసింది. మొదటి రోజు జరిగిన మ్యాచ్‌లో నవశక్తి క్రీడా మండల్ జట్టు 44-27తో వరంగల్‌పై విజయం సాధించింది. మిగతా మ్యాచ్‌ల్లో భారత క్రీడా ప్రాధికార సంస్థ(సాయ్) 29-20తో శ్రీకృష్ణ క్లబ్‌పై, ఆర్ఆర్‌సీ 37-15తో సంగారెడ్డిపై గెలిచి ముందంజ వేశాయి. మరోవైపు సూర్యాపేట 34-17తో ఎల్బీ స్టేడియంపై, రంగారెడ్డి 35-16తో సంగారెడ్డిపై, మహబూబ్‌నగర్ 27-7తో సాట్స్ ఎల్బీ స్టేడియంపై విజయాలు సాధించాయి.

రక్త దానం చేసేందుకు ముందుకు రావాలి

రక్తదానంపై అవేర్‌నెస్ వాక్‌ను ప్రారంభిస్తున్న ఉస్మానియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ బి. నాగేందర్

సుల్తాన్‌బజార్, జూన్ 14 : అన్ని దానాల కంటే రక్త దానం గొప్పదని, ప్రతి ఒక్కరూ రక్త దానం చేసేందుకు ముందుకు రావాలని ఉస్మానియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ బి. నాగేందర్ తెలిపారు. శుక్రవారం ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా సూపరింటెండెంట్ కార్యాలయం నుంచి దవాఖాన ప్రధాన ద్వారం వరకు స్వచ్ఛంద రక్త దానంపై అవేర్‌నెస్ వాక్‌ను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన ఈ వాక్‌ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. తలసీమియా వ్యాధి గ్రస్తులకు, రోడ్డు ప్రమాదాల సమయంలో ఖచ్చితంగా రక్తం అవసరమవు తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ రక్త దానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ విభాగం సీనియర్ రెసిడెంట్ డాక్టర్ సాయిసుధ ఆధ్వర్యంలో నిర్వహించిన సెషన్‌లో ఆరోగ్య నిపుణులలో రక్త దానం గురించి అవగాహన కల్పించారు. అనంతరం నిర్మాణ సంస్థ డాక్టర్ రాజేశ్, మహాత్మాగాంధీ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, మహావీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల కార్యదర్శి ఎస్ సురేందర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వీరేంద్ర పాటిల్‌ను ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా సన్మానించారు. దవాఖాన సీఎస్ అడ్మిన్ ఆర్ఎంవో-1 డాక్టర్ శేషాద్రి, డిప్యూటీ సీస్ అడ్మిన్ ఆర్ఎంవోలు డాక్టర్ సాయిశోభ, డాక్టర్ బండారి శ్రీనివాసులు, ఆర్ఎంవోలు డాక్టర్ కవిత, డాక్టర్ అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

అబిడ్స్, జూన్ 14: ఈఎంఆర్ఐ(1962) సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 15న పైలట్(డ్రైవర్)ఉద్యోగాల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్ ప్రొగ్రామ్ మేనేజరర్ షేక్ జాన్‌షహీద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించి 23 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన ఎల్ఎంవీ(బ్యాడ్జ్)కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 15న కింగ్‌కోఠి జిల్లా దవాఖాన ప్రాంగణంలోని 108 రీజినల్ కార్యాలయంలో ఉతయం పది నుంచి 3 గంటల వరకు నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. మరింత సమాచారం కోసం 900 0001674 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. ఈ ఉద్యోగాలలో ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్ జిల్లాలో పనిచేయాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

జీహెచ్ఎంసీ సర్కిల్-14 భవనంలో నిర్వహించిన సమావేశంలో డిప్యూటీ కమిషనర్ విద్యాధర్, గన్‌ఫౌండ్రీ కార్పొరేటర్ సురేఖ, ఇతర అధికారులు

సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి

అబిడ్స్, జూన్ 14 : ఎన్నికల నేపథ్యంలో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయని గన్‌ఫౌండ్రీ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓంప్రకాశ్ భీష్వ అన్నారు. శుక్రవారం జీహెచ్ఎంసీ సర్కిల్-14 భవనంలో డిప్యూటీ కమిషనర్ విద్యాధర్, అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ ముగిసిన కారణంగా అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించాలని అన్నారు. ప్రధానంగా వర్షాకాలం నేపథ్యంలో వరద ప్రభావం అధికంగా ఉన్న నేతాజీ నగర్, ఆదర్శనగర్, ప్రగతి మహావిద్యాలయ ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో చర్చించించినట్లు తెలిపారు. గుంతలు ఏర్పడిన రోడ్లపై ప్యాచ్‌వర్క్ పనులు పూర్తి చేయాలని డిప్యూటీ కమిషనర్ విద్యాధర్‌ను కోరారు. టౌన్‌ప్లానింగ్ ఏసీపీ లక్ష్మినారాయణ, వేణుగోపాల్, భూమాతో పాటు అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ అన్నారు. డివిజన్‌లోని జవహర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన బడిబాట, అక్షరాభ్యాస కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ హాజరై విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలను అందజేశారు. బీజేపీ నాయకుడు ఎ.వినయ్ కుమార్, ప్రిన్సిపాల్ ఎం. స్వర్ణలత, ఉపాధ్యాయులు రేణుక, ఉమమహేశ్వరి, సింగీత, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. – చిక్కడపల్లి, జూన్14

ఢిల్లీ శాస్త్రిభవన్‌లో కేంద్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసి సన్మానిస్తున్న బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డా.ఎన్.గౌతంరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రాంచంద్రారెడ్డి, రాష్ట్ర సహకోశాధికారి ఒ. శ్రీనివాస్‌రెడ్డి, సికింద్రాబాద్ పార్లమెంట్ నాయకులు వీరేల్లి చంద్రశేఖర్, మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు బి.శ్యాంసుందర్‌గౌడ్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఏడెల్లి అజయ్‌కుమార్, ఏడెల్లి అనిల్‌కుమార్. – అంబర్‌పేట, జూన్ 14

ధర్మన్నకు నివాళి

ముషీరాబాద్, జూన్ 14: చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా శుక్రవారం తొలి దళిత కవి, వ్యాసకర్త కుసుమ ధర్మన్న సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి పాల్గొని ధర్మన్న చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాహితీవేత్త రఘుశ్రీ, కుసుమ రాధ, మిద్దె సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కోదండరామ్‌కు తెలంగాణ సాధికారిత విప్లవయోధుడు పురస్కారం ప్రదానం

ప్రొఫెసర్ కోదండరామ్‌కు పురస్కారం బహూకరించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

రవీంద్రభారతి, జూన్14: కోదండరామ్ తెలంగాణ ఉద్యమంలో అంకితభావంతో పనిచేసి ప్రజలు, కార్మికులు, ఉద్యోగులను ఏకతాటిపైకి తీసుకువచ్చి తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిన గొప్ప మహనీయుడని టూరిజం, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ భాషాసాంస్కృతిక శాఖ , సీల్‌వెల్ కార్పొరేషన్, కృతిలయ ఫౌండేషన్ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ దశాబ్ది వేడుకలు, ప్రొఫెసర్ కోదండరామ్‌కు తెలంగాణ సాధికారిత విప్లవయోధుడు పురస్కారం, సీలవెల్ సినీ సుస్వరాలు కార్యక్రమం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి కృ'ష్ణారావు, కోలేటి దామోదర్‌గుప్త విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి కోదండరామ్‌కు పురస్కారం బహూకరించారు. సభకు ముందు నవరస గాయని ఆమని బృందంచే సీల్‌వెల్ సుస్వరాలు-57 కార్యక్రమం వీక్షకులను రంజింప చేసింది. ఈ కార్యక్రమంలో సీల్‌వెల్ సీఎండీ బండారు సుబ్బారావు, కుసుమ భోగరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం..వ్యక్తి మృతి

గోల్నాక, జూన్ 14: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ విజయ్ తెలిపిన ప్రకారం.. బాలాపూర్ కుర్మల్‌గూడకు చెందిన మొగిలయ్య కుమారుడు అశోక్ (33) అదే ప్రాంతానికి చెందిన హైమద్ తిలక్‌నగర్‌లోని ఓ టెంట్‌హౌజ్‌లో పని చేస్తున్నారు. గత గురువారం మధ్యా హ్నం వీరిద్దరూ కలసి పని నిమిత్తం బైక్‌పై వెళ్తుండగా గోల్నాక కొత్త బ్రిడ్జి వద్ద ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి కింద పడటంతో తీవ్రగాయాలయ్యాయి. వీరిని దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ అశోక్ మృతి చెందగా, హైమద్ పరిస్థితి విషమంగానే ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డిసిల్టింగ్ పనులు ప్రారంభం

అబిడ్స్,జూన్ 14: పురానాపూల్ గాంధీ విగ్రహం నుంచి గణేశ్ టెంపుల్ 14-8 బ్లాక్ వరకు ఎన్ఐఎస్ లైన్ డిసిల్టింగ్ పనులను శుక్రవారం గోషామహల్ కార్పొరేటర్ లాల్ సింగ్ జనరల్ మేనేజర్ జాన్ షరీఫ్, డీజీఎం శ్రీనివాస్, మేనేజర్ గురునాథ్‌లతో కలిసి ప్రారంభించారు. నటరాజ్ నమాద్రి, రమేశ్‌సింగ్, ఉదయ్‌సింగ్, సుదయ్‌సింగ్, మరళీక్రిష్ణ, ఆనంద్‌యాదవ్ పాల్గొన్నారు.

సేవాగుణాన్ని అలవర్చుకోవాలి

చిక్కడపల్లి, జూన్14 : ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలని తెలంగాణ జన సమితి గ్రేటర్ అధ్యక్షుడు ఎం. నర్సయ్య అన్నారు. సమితి నాయకుడు గుండెల్లి రవీందర్‌యాదవ్ ఆధ్వర్యంలో అరుంధతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పలకలు, పండ్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సయ్య హాజరై ప్రారంభించారు. సమితి నాయకులు మెరుగు శ్రీనివాస్‌యాదవ్, సుధాకర్, అజయ్‌గౌడ్ పాల్గొన్నారు.

వసతి గృహం ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

ట్రస్ట్‌బోర్డు చైర్మన్ వెంకట్‌రావుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న కొండ దేవయ్య, మహేందర్‌కుమార్, సభ్యులు

కాచిగూడ, జూన్ 14: మున్నూరుకాపులు ఐకమత్యంతో ఉన్నప్పుడే ఏదైనా సాధించవచ్చని తెలంగాణ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య అన్నారు. ఇటీవల జరిగిన సమావేశంలో మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి కలిసి మాట్లాడుతూ.. కాచిగూడ మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ఆస్తులు రూ.200 కోట్లు మున్నూరుకాపు మహా సభ ఆస్తులని, అదే విధంగా 1930 సంవత్సరం నుంచి మున్నూరుకాపు మహా సభనే ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కాచిగూడ మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ఆస్తులపై శ్వేత పత్రం విడుదల చేయాలని శుక్రవారం డాక్టర్ కొండ దేవయ్య, ఆర్.వీ.మహేందర్‌కుమార్, సభ్యులు మున్నూరుకాపు విద్యార్థి ట్రస్ట్ బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ ఎం.ఆర్.వెంకట్ రావుకు వినతి పత్రాన్ని అందజేశారు.

హెబ్రోన్ చర్చి వద్ద ఉద్రిక్తత

చిక్కడపల్లి, జూన్ 14 : గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోన్ చర్చి వద్ద ట్రస్ట్ సభ్యులు రావడానికి ప్రయత్నిస్తే వారిని సొసైటీ సభ్యులు అడ్డుకున్నారు, దీంతో ఉద్రిక్తత ఏర్పడింది. చిక్కడపల్లి పోలీసులు అక్కడికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చర్చి సొసైటీ ప్రధాన కార్యదర్శి రాగి పీటరాచారి మాట్లాడుతూ.. హెబ్రోన్ చర్చిలోకి రావడానికి ట్రస్ట్‌కు సంబందించిన వ్యక్తులు దాడులు చేశారని తెలిపారు. ముఖ్యంగా రాయలసీమ నుంచి 200 మందిని తీసుకొచ్చి దాడి చేసి లోపలకి రావడానికి ప్రయత్నించడంతో సొసైటీ సభ్యులు అడ్డుకున్నారని తెలిపారు. పోలీసులకు సమాచారం అందించడంతో పరిస్థితి అదుపులోకి తెచ్చారని వివరించారు. సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ట్రస్ట్‌కు అనుగుణంగా కోర్టు ఆర్డర్..

సిటీ సివిల్ కోర్టులో ట్రస్ట్‌కు అనుగుణంగా ఆర్డర్ ఇచ్చిందని ట్రస్ట్ సభ్యులు పాల్ డేవిడ్, అద్దంకి ఇమానుయేల్, సామ్యుల్ తెలిపారు. రాగి పీటరాచారి అక్రమంగా చర్చిలో కొనసాగుతున్నారని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని అన్నారు.

రైలు ఢీకొని వృద్ధురాలు మృతి

కాచిగూడ, జూన్ 14: రైలు ఢీకొని వృద్ధురాలు మృతి చెందింది. కాచిగూడ రైల్వే హెడ్ కానిస్టేబుల్ మక్సూద్ వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మం డలం, చెన్నారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కిష్టమ్మ(65)బుద్వేల్- ఫలక్‌నుమా రైల్వేస్టేషన్‌ల మధ్య గురువారం రాత్రి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతురాలు బూడిద రంగు చీర, నలుపు రంగు జాకెట్ ధరించి, ఎత్తు 5.2 ఉన్నటు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

చింతచెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

కాచిగూడ,జూన్ 14: చింతచెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్సై డి. సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. బర్కత్‌పుర ప్రాంతానికి చెందిన గౌరయ్య కుమారుడు పి.రామదాసు ఇస్త్రీ షాపు. శుక్రవారం ఇంటి పక్కన ఉన్న చింతచెట్టు కాయలు తెంపడానికి చెట్టెక్కి, ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కాచిగూడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్సై తెలిపారు.

1962 అంబులెన్స్‌లో పైలట్, డ్రైవర్ ఉద్యోగాలకు దరఖాస్తులు

మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 14 : పశు సంచార వైద్య సేవలందించే 1962 అంబులెన్స్‌లో పైలట్, డ్రైవర్ ఉద్యోగాలకు దరఖాస్తులు అహ్వానిస్తున్నట్లు సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ షేక్ జాన్‌షాహిద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి పాసై, 23 నుంచి 35 సంవత్సరాలలోపు వయసున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ సెట్‌తో ఇంటర్వ్యూకి హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9000001674 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.